# 1857 తిరుగుబాటు - ఆంధ్ర, హైదరాబాద్‌లపై ప్రభావం

భారతదేశ చరిత్రలో క్రీ.శ.1857 నాటి సిపాయిల తిరుగుబాటుకు ఎంతో ప్రాధాన్యముంది. దీన్ని ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తించవచ్చు. 1857, మే 10న మీరట్‌లో ప్రారంభమైన ఈ తిరుగుబాటు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లలో తీవ్రస్థాయికి చేరింది. ఆంధ్ర ప్రాంతం, నిజాం సంస్థానంలో ఈ తిరుగుబాటు ప్రభావం లేక పోలేదు. అయితే ఆంధ్రలో అతి తక్కువ ప్రభావాన్నే చూపిందని చెప్పాలి.

సిపాయిల తిరుగుబాటులో భాగంగా బహదూర్ షా (మొగల్ చక్రవర్తి) భారత చక్రవర్తిగా ప్రకటితమయ్యాడనే వార్తతో అతని విజయాన్ని కాంక్షిస్తూ కడప ముస్లింలు మసీదులో ప్రార్థనలు చేశారు. షేక్ పీర్ సాహెబ్ అనే ముస్లిం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జిహాద్ (పవిత్ర యుద్ధం) చేయమని ముస్లింలకు ప్రబోధించాడు. ఇక విశాఖపట్నంలో మొహర్రం పండగ సందర్భంగా ముస్లింలను రెచ్చగొడుతూ ఓ పోస్టర్ వెలిసింది.

**ఆంధ్ర ప్రాంతంలో ఉద్యమాలు :**

గంజాం, గోదావరి జిల్లాల్లోని పర్లాకిమిడి ప్రాంతంలోని సవరజాతి గిరిజనులు ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. దండసేనుడు నాయకత్వం వహించిన ఈ తిరుగుబాటుకు 'పర్లాకిమిడి తిరుగుబాటు' అని పేరు. కెప్టెన్ విల్లన్ నేతృత్వంలోని బ్రిటిష్ సైన్యం ఈ తిరుగుబాటును అణచివేసింది. దండసేనుడికి ఉరిశిక్ష పడింది.
ఇదేకాలంలో మరో తిరుగుబాటు గోదావరి ప్రాంతంలోని ఎర్నాగూడెంలో మొదలైంది. కారుకొండ సుబ్బారెడ్డి దీనికి నాయకుడు. ఇతను కొరటూరు గ్రామ మునసబు. బ్రిటిష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టడానికి మహారాష్ట్ర వీరుడు నానాసాహెబ్ గొప్ప సైన్యంతో వస్తున్నాడని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడే వారందరికీ బహుమతులు ఇస్తాడని ప్రచారం చేసి సుబ్బారెడ్డి గిరిజనులను సమీకరించాడు. అయితే బుట్టాయిగూడెం మునసబు శంకరస్వామిపై గల సొంత పగను తీర్చుకునేందుకు సుబ్బారెడ్డి ఈ పన్నాగం పన్నాడనే విమర్శ కూడా ఉంది. అయితే బ్రిటిష్ ప్రభుత్వం సుబ్బారెడ్డిని ఉరితీయడం ద్వారా ఈ తిరుగుబాటును అణచివేసింది.

ఆంధ్ర ప్రాంతంలో ఆంగ్లేయుల వ్యతిరేకోద్యమానికి హైదరాబాద్ రాష్ట్రం నుంచి రోహిల్లాలు, ఆరబ్‌లు సరిహద్దు ఆంధ్ర ప్రాంతాలపై జరిపిన దాడులు కూడా ప్రేరణ కలిగించాయి. కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట తాలూకా ఖజానాను హైదరాబాద్ రోహిల్లాలు దాడి చేసి దోచుకున్నారు. కర్నూలు, కడపల్లో కూడా ఇవి జరిగాయి. కోయిలకుంట తాలూకా రుద్రవరంపై జరిగిన దాడి కాస్త తీవ్రతరమైంది.

1857 విప్లవంలో చెప్పుకోదగ్గ మరో సంఘటన చిత్తూరు జిల్లాలో జరిగింది. చిత్తూరు జిల్లా పాలెగార్లు బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేశారు. దీనికి బంగారుపాలెం జమీందారు కోమారుడు నాయకుడు. మరోవైపు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైనికులు తిరుగుబాట్లు చేయడమూ కనిపించింది. 1857 ఫిబ్రవరిలో విజయనగరం జిల్లాలోని రెజిమెంట్ (సైన్యం)ను కర్నూలుకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించినా సైనికులు వెళ్లలేదు. అధిక జీతం ఇవ్వాలని, తమ కుటుంబ సభ్యులను తమతో తీసుకువెళ్తామని సైనికులు షరతులు విధించారు.

ఇలాంటిదే బళ్లారిలో కూడా జరిగింది. బళ్లారి రెజిమెంట్ సైనికులను బెంగాల్ తిరుగుబాటును అణిచి వేసేందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, తమకు 1853 నాటి అధిక జీతం ఇస్తేనే వెళ్తామని మొండికేశారు. మేజర్ జనరల్ బెస్ట్‌పోర్ట్ వారికి నచ్చజెప్పడంతో 1857, జూన్ 27న తాము బెంగాల్ వెళ్లేందుకు సిద్ధమంటూ అదే సైనికులు ప్రభుత్వానికి ఉత్తరం రాయడం గమనించదగ్గ విషయం.

సిపాయిల తిరుగుబాటు తీవ్ర దశలో ఉన్నప్పుడు ఆంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో బ్రిటిష్ ప్రభుత్వానికి మద్దతుగా సభలు జరగడం విశేషం. ముఖ్యంగా.. చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నలలో ఇవి జరిగాయి. కంపెనీ పాలనలో ప్రజలు కష్టాలకు గురైనప్పటికీ సుస్థిర ప్రభుత్వం వల్ల కలిగే ఫలితమే ఈ సభల వెనుకనున్న కారణం.

**1857 తిరుగుబాటు – నిజాం రాష్ట్రం :**

1857 తిరుగుబాటు ప్రభావం ఆంధ్ర ప్రాంతంపై కంటే హైదరాబాద్ సంస్థానంపై, అక్కడి ప్రజలపై ఎక్కువ. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వారి సైన్య సహకార పద్ధతికి నిజాం ఒప్పుకున్న నాటి నుంచి హైదరాబాద్‌లోని కొన్ని ముస్లిం వర్గాల్లో బ్రిటిష్ వారి పట్ల వ్యతిరేకత పెరుగుతూ వచ్చింది. అందుకనే 1857 కంటే ముందు కొన్ని తిరుగుబాట్లు జరిగాయి.

1839లో ఉత్తర భారతం నుంచి వచ్చిన వహాబీలు కంపెనీ పాలనను కూలదోయాలనుకున్నారు. ఇందుకోసం నాటి హైదరాబాద్ నవాబు నసీరుద్దౌలా సోదరుడు ముబారిజుద్దౌలా ప్రోత్సాహంతో కుట్ర పన్నారు. కానీ, ప్రభుత్వం ముబారిజుద్దౌలాను అరెస్టు చేసి 1854లో అతను చనిపోయే వరకు గోల్కొండ కోటలో బంధించింది. వహాబీలతో చేతులు కలిపిన ప్రభుత్వం కర్నూలు నవాబు గులాం రసూల్‌ఖాన్‌ను తిరుచునాపల్లి జైలులో ప్రభుత్వం నిర్బంధించింది.

సిపాయిల తిరుగుబాటు ఉత్తర భారతంలో తీసుకొచ్చిన చైతన్యం హైదరాబాద్ సంస్థానానికీ పాకింది. అల్లాఉద్దీన్ అనే మౌల్వీ మక్కా మసీదులో ప్రసంగిస్తూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇస్లాంకు ప్రథమ శత్రువుగా అభివర్ణించాడు.

ఔరంగాబాద్‌లోని సిపాయిల్లో అప్పటికే ఉన్న అసంతృప్తికి 1857 తిరుగుబాటు ఆజ్యం పోసింది. హైదరాబాద్ సంస్థాన దళాలకు చెందిన ఔరంగాబాద్– ఒకటి, రెండు అశ్విక దళాలు బ్రిటిష్ ప్రభు

త్వాన్ని ధిక్కరించాయి. నిజాం రాజ్యపు సరిహద్దుల్ని దాటి మా సాటి మతం వారిపై మేం యుద్ధం చేయబోమని ప్రకటించాయి. ఈ తిరుగుబాటుకు అమీర్‌ఖాన్ అనే జమేదార్, మీర్ ఫిదా అలీ అనే డఫేదార్ నాయకులు. అయితే కంపెనీ అధికారులు ఈ తిరుగుబాటును అణచి వేశారు. 1857, జూన్ 23న 90 మంది సిపాయిల్ని నిరాయుధుల్ని చేసి జైలుకు పంపారు. కెప్టెన్ అబ్బాట్ అనే ఆంగ్ల సైనికాధికారిని చంపడానికి ప్రయత్నించిన మీర్ ఫిదా అలీని ప్రభుత్వం ఉరి తీసింది. అతని శవం ఉరిపై వేలాడుతుండగా సైనికులు దాన్ని చూస్తూ కవాతు చేయాలని ఆదేశించింది. తద్వారా వారిలో మరో తిరుగుబాటు రాకుండా భీతి గొల్పింది. మరో నాయకుడు అమీర్‌ఖాన్ మాత్రం ప్రభుత్వానికి చిక్కకుండా తప్పించుకున్నాడు.

ఇలాంటిదే మరో తిరుగుబాటు హైదరాబాద్ నగరంలో జరిగింది. బ్రిటిష్ రెసిడెన్సీపై తురాబజ్‌ఖాన్ అనే రోహిల్లా జమేదార్ 1857, జూలై 17న 5,000 మందితో దాడి చేశాడు. కల్నల్ డేవిడ్‌సన్ దీన్ని అణచి వేశాడు. కుర్బాన్ ఆలీ అనే వ్యక్తి సాయంతో తూప్రాన్ గ్రామం వద్ద తురాబజ్‌ఖాన్‌ను ప్రభుత్వం అరెస్టు చేసింది. మరోవైపు ఇతనికి సహకరించిన మౌల్వీ అల్లాఉద్దీన్‌ను మంగళపల్లి వద్ద అరెస్టు చేసి అండమాన్ జైలుకు ప్రభుత్వం పంపించింది. అక్కడే అతను 1884లో మరణించాడు.

1857 అనంతరం కూడా హైదరాబాద్ సంస్థానంలో బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు జరిగాయి. షోలాపూర్‌లో రాజా వెంకటప్ప నాయక్ తిరుగుబాటు, నిర్మల్‌లో రోహిల్లా పితూరా, అజంతా వద్ద భిల్లుల తిరుబాటు, ఆదిలాబాద్‌లో రాంజీగోండ్ చేపట్టిన దాడి, కొలాస్‌లో రంగారావు పట్వారీ లేవదీసిన పోరాటం మొదలైనవి ఈ వరుసలో చెప్పుకోదగ్గవి. వీటన్నింటి కంటే మించినది రావ్ సాహెబ్ పీష్వా పేర సాగిన కుట్ర.

పీష్వా నానాసాహెబ్‌కు సన్నిహిత బంధువు ఈ రావ్ సాహెబ్‌పీష్వా. ఈయన 1862లో హైదరాబాద్ నగరంలో బ్రిటిష్ వారిపై ఓ కుట్ర సాగించాడు. ఇతని అసలు పేరు రామారావు. ఇతను 1862, మార్చిలో హైదరాబాద్ చేరుకున్నాడు. కిషన్‌లాల్ అనే షావుకారుకు చెందిన బాలముకుందబాగ్ అనే ఆలయవనంలో మకాం వేశాడు. ఆర్మూర్ తాలూకాలోని మార్తాండ్ జమీందార్ రుక్మారెడ్డి, రాజా రెడ్డి, తుల్జారామ్ తదితరుల సానుభూతి, సహాయాన్ని సంపాదించాడు. పూరణ్‌మల్ అనే షావుకారు ఆధిపత్యంలోని షరాబ్ అనే వ్యాపార సంస్థ నుంచి నిధులు పొందాడు.

ఈ కుట్ర విషయం సాలార్‌జంగ్‌కు తెలిసింది. నిజాం ప్రభుత్వానికి చిక్కినట్టే చిక్కి రెండుసార్లు తప్పించుకున్నాడు రామారావు. ఒకసారి బేగంబజార్‌లోని కిషన్‌లాల్ ఇంటిలో రామారావు ఉన్నాడని తారాసింగ్ అనే జమేదార్ సోదాలు చేశాడు. మరోసారి నార్సింగి గ్రామం వద్ద సోదాలు జరిగాయి. రామారావును పట్టుకోలేక పోయిన ప్రభుత్వం రుక్మారెడ్డికి యావజ్జీవ శిక్ష విధించింది. పూరణ్‌మల్‌కు జరిమానా విధించింది. రామారావుకు ఆశ్రయం కల్పించాలన్న అభియోగంపై రామ్ రతన్‌జీని అరెస్టు చేయగా అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

## ప్రశ్నలు

1) **కారుకొండ సుబ్బారెడ్డి తిరుగుబాటు చేసిన ప్రాంతం?**
ఎ) విశాఖపట్నం　బి) కడప
సి) పర్లాకిమిడి　డి) ఎర్నాగూడెం

2) **పర్లాకిమిడి తిరుగుబాటుకు నాయకుడు?**
ఎ) రుక్మారెడ్డి　బి) సుబ్బారెడ్డి
సి) దండసేనుడు　డి) అల్లాఉద్దీన్

3) **పర్లాకిమిడి తిరుగుబాటులో పాల్గొన్న గిరిజనులు?**
ఎ) సవరలు　బి) కొండదొరలు
సి) గోండులు　డి) భిల్లులు

4) **ఎవరికి ఆశ్రయం కల్పించినందుకు రుక్మారెడ్డి శిక్ష పడింది?**
ఎ) కిషన్‌లాల్　బి) రామారావు
సి) తుల్జారాం　డి) చావనీరాజా

5) **రామారావుకు ఆశ్రయం కల్పించాడన్న నేరం తనపై మోపడంతో ఆత్మహత్య చేసుకున్నది?**
ఎ) రాం రతన్ జీ　బి) కిషన్ జీ
సి) కిషన్‌లాల్　డి) రుక్మారెడ్డి

6) **ఆదిలాబాద్ తిరుగుబాటు నాయకుడు?**
ఎ) దండసేనుడు　బి) తురాబజ్‌ఖాన్
సి) రాంజీగోండ్　డి) రంగారావు

7) **1862లో హైదరాబాద్ నగరంలో ఎవరు కుట్రపన్నారు?**
ఎ) రంగారావు　బి) రాంజీగోండ్
సి) తాంతియా తోపే　డి) రావు సాహెబ్ (రామారావు)

8) **నిజాంకు బ్రిటిష్ వారిచ్చిన బిరుదు?**
ఎ) స్టార్ ఆఫ్ ఇండియా　బి) జ్యువెల్ ఆఫ్ ఇండియా
సి) మెగా ఆఫ్ ఇండియా　డి) కింగ్ ఆఫ్ ఇండియా

9) **రెసిడెన్సీపై దాడికి ప్రయత్నించిన వారు?**
ఎ) తురాబజ్‌ఖాన్　బి) అఫ్జలుద్దౌలా
సి) చిడ్డాఖాన్　డి) నానాసాహెబ్

10) **రెసిడెన్సీపై ఎప్పుడు దాడి జరిగింది?**
ఎ) 1857, మే 10　బి) 1858, మే 11
సి) 1858, జూలై 17　డి) 1857, జూలై 17

11) **బుల్దానాలోని కంటింజెంట్ సైనిక తిరుగుబాటుకు నాయకుడు?**
ఎ) అఫ్జలుద్దౌలా　బి) దండసేనుడు
సి) చిడ్డాఖాన్　డి) రాంజీగోండ్

12) **ఔరంగాబాద్‌లో అశ్వికదళాల సైనిక తిరుగుబాటు నాయకులు?**
ఎ) దండసేనుడు, రామారావు
బి) చిడ్డాఖాన్, అలీఖాన్
సి) అమీర్‌ఖాన్, మీర్‌ఫిదా అలీ
డి) ఎవరూకాదు

13) **1857 తిరుగుబాటు ప్రభావం ఏ ప్రాంతంపై ఎక్కువ?**

SAKSHI

ఎ) హైదరాబాద్ బి) మద్రాస్ ప్రాంతం

సి) ట్రావెన్‌కోర్ ప్రాంతం డి) ఆంధ్ర ప్రాంతం

**14) పర్లాకిమిడి తిరుగుబాటులో దండసేనుణ్ణి, పోరాటాన్ని అణచి వేసిన బ్రిటిష్ సైనికాధికారి ఎవరు?**

ఎ) కెప్టెన్ విల్లన్ బి) కెప్టెన్ బ్రుక్స్

సి) కెప్టెన్ ఆబట్ డి) కెప్టెన్ డేవిడ్‌సన్

**15) కడపలో బ్రిటిష్ వారిపై జిహాద్‌ను ప్రకటించిన వారెవరు?**

ఎ) షేక్ పీర్ సాహెబ్ బి) అమీర్‌ఖాన్

సి) అల్లాఉద్దీన్ డి) ఖాన్‌సాబ్

**సమాధానాలు :**

1) డి 2) సి 3) ఎ 4) బి 5) ఎ 6) సి

7) డి 8) ఎ 9) ఎ 10) డి 11) సి 12) సి

13) ఎ 14) ఎ 15) ఎ

SAKSHI